# కుట్ర

పట్నంలో యేదో కేసొతోందట – యిన్నావా? ఈ మధ్య మరదలు పెళ్ళి సంబరంలోపడి నాల్రోజులు యే పేపర్లూ సూళ్ళేదు.

మన పేడి శర్మ లేడా – ఆడూ, ఆళ్ళ సీనియరు దివోదాసూ నిన్న కోరుట్నుండొస్తూ దార్లో కనిపించేరు.

ఏదో మాటల్లో –

"దగ్గిర దగ్గిర నూటేభైమంది ముద్దాయిలూ వెయ్యిమంది సాక్షులూ!" అంటుంటే –

''ఏటి దొమ్మీకేసా?'' అన్నాడు – నాతో తిరుగుతూంటాడూ, భీమారావని, ఆయన.

"కాదు కాన్సిరసీ" అన్నారు.

కాన్సిరసీ అనగానే నాకు నవ్వొచ్చింది. నవ్వు కాదా?

కుట్రంటే – ఇద్దరో ముగ్గురో మధ్య రహస్యంగా ఏదైనా జరిగితే అది కుట్ర. నూర్నూటేభై మంది జనఁవేటి, ఆళ్ళ పక్షాన కాదు, నీ పక్షాన పలకడాని కొచ్చినోళ్ళే వెయ్యిమంది సాక్షులు! అంత సాక్షింలో జరిగిందీ అంటే అది పబ్లిగ్గా జరిగిందన్న మాట. అలాటిది ఏటన్నా కావచ్చు గాని కుట్రనడానికి మాత్రం కాదు. నన్నడిగితే దాన్ని కుట్రనడఁవే ఓ పెద్ద కుట్రంటాను. ఏటి – తిరుగుబాటనడానికి నీకు నామోషీ దేనికి?

నేనా మాటే అన్నాను.

"ఏఁవి సాఁవీ మీలా పుస్తకాల్లో కుట్రకీ, తిరుగుబాటుకీ వేరే వేరే పదా ల్లేవా? ఉన్నా, ఇంగ్లీషోడి సాఁవెత ఉంది గదా, ఉరితీసీ ముందు చెడ్డపేరెట్టని, ఇది ఆ పద్ధతా?" – అన్నాను.

''కాదు కాదు. లావ్ఫుల్‌గా ఏర్పడ్డ గవన్మెంటుని కూల్దొయ్యడం, అందుకు ప్రయత్నించడం కూడా నేరమే. ఆ ప్రయత్నం ఎందరు చేసినా ఏ – దేశంలో చేసినా దాన్ని కుట్రనే అంటారు." అన్నాడు పేడిశర్మ.

చూసేవ్ కదూ, ఆ మాటలో యిసురు! నేను జవాబిద్దాఁ వనే అనుకున్నాను. ఇంతలో మన కవికుల తిలకుడు –

"ఏఁవిటీ? రాజ్యాలే కాదు. రాజులు కూడా మారడానికి వల్లకాదంటారేఁవిటి?" అన్నాడు శిష్ట వ్యావహారికంలో.

మార్చొచ్చట. అయితే ఆ మారడం చట్ట సమ్మతమైన పద్ధతుల్లోనే జరగా లట. అలాగని కాన్‌స్టిట్యూషన్ మీదా ఫండమెంటల్ రైట్సు మీదా సింకి లెక్చరు ఓపెన్ చేసేడు పేడిశర్మ. మరింక లాభం లేదని నేనూ దిగేసేను రంగంలోకి.

"ఏటి గురూ! కాన్‌స్టిట్యూషన్ రాసినోళ్ళుగాని అంత యెర్రి కూపులేటి?" అన్నాను.

దెబ్బతో పేడిమూతికి నోరు షటాప్ అయిపోయింది. దివోదాసుగారు మన దేవభాషకి తట్టుకోలేక వక్కపొడి కొను నెపముతో పక్క కిళ్ళీ కొట్టుకు జారుకున్నారు. మీతో మాటాడలేం – అంటూ పేడిశర్మ మొహం ముటకరించు కొని ముందుకు పోయేడు.

అవును గురూ. ఆయనలాటోళ్ళకి రాజ్యాంగాల్లో ఏటి రాసుందో తెలిసుండొచ్చు. రాజ్యాంగాలు ఎందుకు రాస్తారు, ఎలా రాస్తారు? ఆ సంగతి తెలిసుందంటే నేన్నమ్మను.

ఇప్పుడు నువ్వే వున్నావు గురూ. ఓ కోపరేటివ్ సొసైటీయో, ఓ హౌసింగ్ స్కీమో, అందాకా ఎందుకూ – ఓ కల్చరల్ క్లబ్బే ఎడదాఁవనుకున్నావ్?

ఎందుకనుకుంటావూ?

నీకేదో ఓ ఉద్దేశం ఉండాలి.

నువ్ బాగుపడదాఁవనో, నీ సుట్టాలు పక్కాలు – నీ స్నేహితుల్ని పైకి లాగుదాఁవనో, అల్లాడు ఫలానా ఘనకార్యం చేసేస్తున్నాడు – ఆణ్ణి మీరి పోవాలనో, ఏదో – ఏదో ఒక ఉద్దేశఁ వుంటాది. కాదు – ప్యూరు దేశసేవే అయినా, ఆ సేవ క్కూడా నీ కులఁవనో ఫలానా కులఁవనో కార్మికులు కర్షకులు పీడిత మాజీ సంస్థానాధీశులు – ఇలాటి లిమిటేషను ఏదో ఒక టుంటాది. ఏ లిమిటేషన్లూ లేని సంస్థలుండవు.

నువ్ బయటికి చెప్పొచ్చు చెప్పక పోవొచ్చు. కాని లిమిటేషన్లుండి తీరతాయి.

ఏ ఉద్దేశంతో నువు మొదలెట్టినా, అది సాగాలంటే, అలాటి ఉద్దేశఁవేగల మరి కొందరి అండదండలు కూడా నీక్కావాల. అండదండలుండాలి కానీ ఆళు తొలీ, నువ్వెనకా పోకూడదు. ఆళు నీ లీడరుషిప్పు అంగీకరించి నువ్ చెయ్యదలచిన పనంతా చేసి పెట్టాలి.

అందుకని నీ బైలా లెలాగుంటాయీ –?

ఏ రూల్సు లేప్పోతే నీ కిబ్బందై, ఏ రూల్సు పెడితే నీక్కాబోయే ప్రత్యర్థులకి కాళ్ళూ చేతులూ ఆడవో అలాటి రూల్సే అన్నీ యెతికెతికి రాస్తావు.

మాట వరసకి – "ఎనీ సిటీజెన్ ఆఫ్ దిస్ టౌన్–" అంటానే "ఎ డోమిసైల్ ఫర్ లీస్ట్ ట్వెంటీ ఇయర్స్ – " అంటావు. ఆ క్లాజు తగిలించడఁవెందుకూ – మనం పాతికేళ్ళ క్రితం యీ ఊళ్ళోలేం. దిగి ఇరవయ్యేళ్ళ పైనయ్యింది. అందుకూ.

బైలాలకి ఏ ఎమెండ్మెంటేదేనా తెచ్చినా యిలాగే.

కొందరు నాటు డెమోక్రేట్లున్నారంటే ఆళకి యూరోపియన్

డెమాక్రసీ లోని ఆయువుపట్లు ఎక్కడుంటాయో తెలిస్నావదు.

మాబు మన పక్షంవైనంతకాలం, అంటే డెమాక్రసీ ఆళకి లాభించినంత కాలం వయోజన ఓటూ, సీక్రెట్ బేలట్టూ అంటూ కుప్పిగంతులేసుగ్గెంతుతారు. ఎప్పుడైతే జనం అపోజిషన్ కాసి తిరిగిపోతారో సీ! యీ దేశానికి డెమాక్రసీ యేటి! మనం మాబాక్రసీలకేగాని డెమాక్రసీలకి తగం – అని తిట్లకి తయారడి పోతారు.

సిసలైన డెమోక్రేట్ అనేవోడు అలాగ బైటపడిపోడు. పేణం పోయినా సరే డెమాక్రసీ మీద యీగల్ని వాల్నివ్వడు.

ఆడి ఎప్రోచే వేరు. అదెలాగుంటాది తెలుసా?

అవును. నిన్న టెలక్షన్లో ముదరోళ్ళు మునపట్లా మనకి ఓట్లెయ్యలేదు. సరే. ఎవరేస్తన్నారు? యువజనులే కసింతలో కసింత మెరుగు. ఎంచేత? ముదరోళ్ళకి మన సంగతెలిసిపోయింది. కుర్ర గుంటలికి తెలియడాని కింకా కొంతకాలం పడతాది. ఆల్రైట్. ఓటేసీవయసు పద్దెనిమిదేళ్ళకి దించీ – అనాల.

అదిగదీ సిసలైన డెమోక్రేట్ ఎత్తుగడ.

నువ్వేం చేసినా – లిబరల్గా ఉన్నట్టు కనపడాల. దానివల్ల అవతలోడు బలహీనమైపోయి అదే సమయంలో నువ్ మెరిసీ గలగాల. కీలకస్థానాల్లో నీ కిష్టం కాని మనుషులు దూర్రాదు. దూరినా ఆర్గనైజేషన్ ఆళ్ళిష్టంవొచ్చినట్టు నడవరాదు. నీ ప్రధాన లక్ష్యం అది. ఆఫీసు రన్నింగ్ కాణ్ణించీ అన్ని వ్యవహార ములూ ఆ గోలుకే సాగుతాయి.

నీకే యింతింతలేసి ఊహలుంటే, మరాళ్ళు ఒక్కొక్కడూ ముక్కోటి కాన్స్టిట్యూషన్లూ తిరగేసి బోర్లించి యీకకి యీకా తోకకి తోకా పరిశీలించేసి అసలు పదార్థమంతా జీర్ణించుకున్నోళ్ళట. ఎలాటెలాటి ఆర్టికల్సులో ఎలాటి బొక్కలుంటాయో దేనిదేని పుచ్చులెంతెంత గట్టియో రాసిన రాజ్యాంగం మీదికి దాడి జరక్కండా వుండాలంటే మేకుబందీలు ఎక్కడెక్కడ ఎలా కొట్టాలో, అయన్నీ సూడకండానే తెలీకండానే రాయించుకుంటారేటి – నాకు తెలీకడుగు తాను.

చట్టసమ్మతంగా – అని నువ్వెట్టించిన షరతే చెపుతాది. దాని ప్రకారం నడిస్తే దాన్ని మార్చలేంవని.

నువ్వలాగ, మరీ అంత కంతల్లేని గదిలో కాపరంవెట్టి, ఉన్న ఒక్క గుమ్మా నికీ మంచం అడ్డేసేస్తే ఆ కాపరం సక్కబెట్టదలచినోడికి రెండే రెండు దార్లు. నిశిరాత్రి నీ పీక పిసికీడం మొదటిది లేదా గోడలు బద్దలు గొట్టేయాల. మూడోదారి లేదు.

హిరణ్య కశిపుణ్ణి అంతఘోరంగా ట్రెచరస్గా చంపడం బాగా లేదన్నాట్ట – ఎవడో.

ఆడు కోరిన వరాలెలాటివి? అన్నాట్ట విష్ణుప్రియుడు.

మోడర్న్ హిరణ్య కశిపులూ అంతే – తక్కువ తిన్నారేటి? కాన్స్టిట్యూషన్ ఆళ్లకి కావలసినట్టు రాయించుకొని యీ కసింత కాలంలోనే భిక్షాధికార్లు లక్షాధికార్లూ, లక్షాధికార్లు మల్టీ – మల్టీ మిలీనీర్సూ అయిపోయి, సాలక యింకా నిచ్చెన్లెత్తేస్తన్నారు. ఆళ్ళని అడ్డడానిక్కాదు, అదుపులో ఎట్టడానిక్కూడా ప్రజలగ్గాని ఆళ్ల సేతిలో ఉందని చెప్పే శాసనాధికారానికి గాని శక్తి సాలడం లేదు. ఆళ్ళు కాన్స్టిట్యూషన్ని అడ్డెట్టుకుంటే అనకూడదుగాని ఆళ్ళ – దేన్నో తెంచడానికి శాతకాదు నీకున్న శాసనాధికారానికి. అదిగందికే ప్రజలు ఉగ్రనారాసింహులు కావలసొచ్చింది.

లేప్పోతే భారతదేశ చరిత్రలో ఇలాటి ఉగ్రవాదాలు ఎప్పుడేనా ఎరుగుదుంవా? నామాట నమ్మప్పోతే పురాణాలుగానీ హిస్టరీలుగాని తిరగేసి చూడండి.

నన్నడిగితే కుట్రనదగ్గదేదేనా జరిగితే రాజ్యాంగం రాసినకాడే జరిగుండాల. పంచవర్ష ప్రణాళికలు ఏసిన్నాడు డెఫినెట్గా జరిగింది. జరిగిందనడానికి దాఖలాలున్నాయి – మన కళ్ళముందే.

అసలు కుట్ర అది. అది దుంప. ఇయన్నీ దాన్లోంచొచ్చిన పిలకలు. సామాజిక వ్యవస్థ అనే బాడీలో విషక్రిమిని ప్రవేశపెట్టేవు. వీక్ బాడీయే. అయినా ఇంకా రోగ నిరోధక శక్తి మిగిలుంది. సంతోషించి సాయం చెయ్య దానికి బదులు రెసిస్టెన్సు చంపడానికా వైద్యం!

కుట్రన్నదేదేనా జరిగితే ప్లాన్లేసినప్పుడే జరిగిందన్నానా? ఆ ప్లాన్లెలాగేసేరో చెపుతా విను. అది కుట్రౌనో కాదో, కాప్పోతే నీ భాషలో దాన్నేం వంటారో నువ్వే చెప్పు.

పి.పి. వైద్యనాథం అంటారు, పేరెప్పుడైనా ఇన్నావా? ఆడెంతటోడో శానాకాలం నాకూ తెలీదు. సెంట్రల్లో ఎడ్యుకేషన్ మినిస్ట్రీ చేసేడనే అనుకున్నాను. కాని ప్లానింగు కమీషన్లో టూ కాన్సిక్యూటివ్ టెరమ్సు మెంబరట!

నైన్టీన్ హండ్రెడ్ సెవెంటీలో కావాల, నెల నాకు సరీగా గుర్తులేదు. టైమ్ మేగజిన్ తిరగేస్తుంటే – యీడి ఫొటో ఒకటి దాని పక్కన యింతింతేసి అక్షరాల్తో యీడి పేరు!

ఏటిగదా అని సూద్దునూ – ఆడిమీద రెండున్నర కోలాల వ్యాసంవు! టైమ్మేగజీన్లో ఓ యిండియన్ గురించి, అప్పటికీడు పవర్లో లేడు, అంత రాయడం వంటే మాట్లేటి? అయితే గట్టోడే అనుకున్నాను. అప్పణ్నుంచి ఆడిమీద అలాగ ఓ కన్నేసి ఉంచేను.

సౌత్ సెంట్రల్ యిండియాలో ప్రొడక్షనూ, మార్కెటింగ్ –ఇండస్ట్రియల్ నెట్ వర్కంతా ఆడి గుప్పెట్లో ఉంటాదిట. సౌదిండియా మార్కెట్లో సరకు దించాలన్నా ఎత్తాలన్నా ఆడి

చూపుటేలు ఆడితే కద్దూ లేప్పోతే లేదు – అన్నట్టు రాసేడు ఆ కాలమిస్టు.

దరిమిలా నేనూ ఆడి రికార్డు సేకరించేను. తెలిసిందేటంటే – ఇండి పెండెన్సుకు ముందు ఆడూ హాఫెనీ టఫెనీ ఇండస్ట్రయలిస్టే! కాప్పోతే సొరాజ్జా టైపు. ఐ.సి.యస్ చెయ్యడానికి లండనెళ్ళేడు. అక్కడ దొరల్తో పడక ఇంటి కొచ్చేసి నలుగురైదుగురు చెట్టియార్లతోనూ, మార్వాడీలతోనూ రెండో మూడో కంపెనీ లెట్టించేడు. 'స్వదేశీ వస్తువులనే కొనండి' లాటి చిన్న చిన్న వ్యాసాల్తో ఆరంభించి 'ఇండియన్ ఎకానమీ అండర్ బ్రిటిష్ రాజ్' అలాటి పుస్తకాల్రాసే దాకా ఎదిగేడు.

ఈ యిరవై యిరవై రెండేళ్ళలోనే – చీరపేను పేడపురుగై అది అక్కణ్నుండి టెంటికల్స్ పెంచి ఆక్టోపస్ లెవల్ కెదిగినట్టు యీడిక్కడ పెరిగిపోయేడు.

ఇప్పుడు సౌతున వంద కంపెనీలున్నాయంటే అందులో తొంభై కంపెనీల్లో నైనా ఆడికి వాటాలుంటాయి. లేప్పోతే ఆడు పార్ట్నర్ అవుతాడు. ఆడు కాప్పోతే ఆడు బామ్మరిది, మేనత్త, మేనమాంవ పెళ్ళం తమ్ముడి కొడుకులు, అప్ప కూతుళ్లు – ఎవళో ఒకళు ఆడి మనుషులంటూ ఉంటారు. కనీసం ఒకళ్ళయినా కీలకస్థానాల్లో ఉంటారు. ఉండి తీరుతారు.

మా ఫ్రెండ్ అంటాడు –

స్టేట్ ఎకనామిక్సు కీ బోర్డు ఎక్కడెక్కడని కేపిటల్లోనూ ఇందంబడందం బడని ఎతికితే దొరకదట. తిరుచ్చో తిరునల్వేలో – ఆడి హెడ్డాఫీసు దొంగ కబ్బోర్డు – సీక్రెట్ వాల్టులో – వెతికితే దొరకటం ఖాయం – అంటాడు మా నేస్తం. అతిశయోక్తే కావచ్చు అంతపాటి మనిషంటే ఒప్పుకోవచ్చు.

హి యీజ్ ది విజార్డ్ ఆఫ్ సౌదిండియా ఛాంబరాఫ్ కామర్సు – అని ఆ టైమ్ కాలమిస్ట్ సర్టిఫికేట్ ఇచ్చేడంటే – మరింక సూసుకో.

అయితే కొందరేటంటారంటే దాకూలుకి తప్ప అలాటి దాకూలు పట్ల గౌరవం కలుగదంటారు.

సరే నా మాటలాగుంచు. ఆడూ దాకూయే. అయితే? లైపులో ఆడు సాధించిన విజయం లేదా? అదేటి – అంత సప్పరించీదగ్గ సంగతా?

ఫస్టు క్లాస్సెంటర్లో నువ్వెంచుకున్న బిల్డింగ్ నీకు అద్దెకిస్తాను. నువ్వెంత కావాలంటే అంత మదుపూ ఏర్పాటు చేస్తాను. నీ యిష్టంవొచ్చిన బిజినెస్ నువ్వేరుకో. అయిదేళ్ళు గడువు. గడువు చివరికి నా అసలు నాకు అప్పగించు. నువ్వు దివాలా తీసి నన్ను ముంచీప్పోతే నా చెవు కదపాయిస్తాను.

కబుర్లు చెపుతారు. ఏం వుంది – తోలునాలిక. ఎలాక్కావాలంటే అలాగే తిరుగుతాది.

ఆడు దాకూ అయ్యేడంటే అయ్యేడు. ఎలాగయ్యేడు? మిగతావాళ్లు చేస్తే కానిస్తే అయ్యేడు. అంతమాత్రాన ఆడి కార్యదక్షతకీ జీనియస్సుకీ క్రెడిటియ్యవా? తెలివితేటలుండడం వే కార్యదక్షతుండడంవే తప్పులాగా మాటాడతావేటీ.

ఒకపాలి మన దేశవాళీ పొలిటేషియన్ ఒకాయన – మనోడి గురించి ఏదో అనబోయేడు. నేనన్నాను –

అవును గురూ మనకి నేషనల్ ప్రైడ్ పాళ్ళు కసింత తక్కువ. అది నీలో ఏ మాత్రం బాలన్సుడుగా ఉన్నా, నువ్వాణ్ణి అలా తీసి పారీవు. ఆడు యీ దేశంలో యీ సెటప్‌లో పుట్టబట్టి పడబట్టి ఇలాగయ్యాడు ఇలాగున్నాడు. అదే – నువ్వేదో సొరగలోకం వంటావే, ఆ దేశంలో, ఆ మంచి వ్యవస్థలో, పుట్టుంటే అక్కడాడి మెటలెలాగ ఉపయోగపడేది? ఆడేంవవును?" అన్నాను.

"అప్పుడూ ఆడు ఇంతే!" అన్నాడు.

"అయితే యింకసొలు ఊరుకో" అనీసేను.

అవునండీ కనుదృష్టి లేనోళ్ళకి కళ్ళివ్వగలం. ఉండి మూసుకున్నోడికి సూపియ్యడంవెలాగా?

నేననేదీ – మన్దేశంలో కొందరు నకిలీ మహాత్ములో ఒక నిజం మహాత్ముడో పుట్టేరంటే పుట్టీ అవకాశం ఉంది. ఎంచేతంటే మొదట్నుంచీ మన్ది స్పిరిచ్యువల్ కంట్రీ కనక.

అలాగే అక్కడో ఆరా, ఇక్కడో పాతికా రామన్లూ టాగూర్లూ పుట్టినా పుట్టొచ్చు – సైంటిఫిక్ ఫీల్డులోనూ లిటరలీ ఫీల్డులోనూ మనకుండుకున్న వారసత్వాన్ని బట్టి.

కానీ –

వరల్డు ప్రిమిటివ్ ఎకానమీల్లో ప్రిమిటివెస్ట్ ఎకానమీ – బియ్యంవిచ్చి కరేపాకు కొనుక్కొనే పద్ధతి – ఇప్పటికీ అమల్లో ఉన్న దేశం, మనదేశం.

ఇలాటి దేశంలో అంతలావు ఇండస్ట్రియలిస్ట్ – కమ్ – ఎకనమిస్ట్ పుట్టడంవంటే, ఏటి అంత తీసిపారేసే దగ్గ సంగతా? 'చరిత్ర నేసిన మనిషి'ని తీసి పారీ దలుచుకుంటే తీసిపారీ. కాని అలా సెయ్యడానికైనా మనిషిలో మెట లుండాల. ఆ సంగతి ఒప్పుకో.

అయితే ఆడిమెటలు మనలాటోళ్లు గుర్తిస్తే ఎంత, గుర్తించకపోతే ఎంత మహా మహా నాయకులే దాన్ని గుర్తించక తప్పలేదు.

దేశానికి పొలిటికల్ ఫ్రీడం వచ్చిన తదుపరి ఎకనామిక్ ఫ్రీడం సాధించడానికి ప్లాన్లు కావాలనుకున్నారు మన నాయకులు. కేపిటలిస్ట్ ఎకానమీయా, సోషలిస్టు ఎకానమీయా – అని దేశంలో రైట్‌లూ లెఫ్ట్‌లూ ఊం కొట్టేసుకుంటుంటే

మిక్సెడెకానమీ అని యీడు ఒక క్రొత్త థీరీ పట్టుకొచ్చేడు.

కొత్తంటే కొత్తా కాదూ, ఆ పేరే కొత్త. ఆ దారి అంతకు ముందు యూరపు దేశాలు తొక్కిందే. ఇప్పుడా బ్రిటననగా ఫ్రాన్సనగా, ఏయే దేశాల్లో అయితే వర్కింగ్ క్లాసు కసింత తెలివి తెచ్చుకొని సోషలిజం గీషలిజం లాటి పదాలతో యాగీ ఆరంభిస్తారో, ఆయా దేశాలన్నిట్లోనూ మసిబూసి మారేడుకాయ చేసే యీ విద్య కొత్తది కాదు. ఈడు దాన్నే బాగా స్టడీ చేసి మిక్సెడెకానామీ అన్నాడు. ఆ పేరేనా యీడెట్టేడో అదీ పాద్దేనో, నాకనుమానఁవే.

అయితే పవర్లో ఉన్న నాయకత్వానికి, ముఖ్యంగా రైట్‌లూ లెఫ్టులూ మధ్య నలుగుళ్ళతో మతిపోతున్న నాయకత్వానికి యీడు చెప్పిన థియరీ బాగా సూటయ్యింది. ఆళ్లీణ్ణి పట్టుకున్నారు.

నువ్వొచ్చి మా ప్లానింగ్ కమీషన్లో ఉండు – అంటే ఆడిచ్చిన జవాబేటో తెలుసా? నేను మీ పార్టీ మెంబర్ని కాను. మీరిప్పుడు చేసినా నాకెప్పుడిష్టం లేప్పోతే అప్పుడు బయిటికి నడిచేస్తాను. మీరు కాదనడానికి వల్ల కాదు – అన్నాడు.

దానికొప్పుకుంటే యింకో షరతు.

ప్లానింగ్ కమీషన్లో మెజారిటీ మీది. ఒకపాలి మిమ్మల్నొప్పించి ఔననిపించిన పథకం, అది ఎంత కష్టఁ వైనా కానీ అమలుచెయ్యడం మీ పూచీ. అందుకెన్ని ఆటంకాలు వచ్చినా మేం దాన్ని అమలుచేసి తీరతాం – అని, కనీసం మీ అగ్రనాయకులు, పెద్దమనిషి తరహా హామీ యివ్వాలన్నాడు.

ఆడెన్ని షరతులెడితే అన్నిటికీ తలూపేసి ఆడొప్పుకున్నదే సాలు మహాప్రభో అని దండఁవెట్టేసి ఆణ్ణి కమీషన్లోకి తీసుకొన్నారు.

అవునండీ – అంతకన్న ఇంకేటి చెయ్యగల్రూ?

గాంధీగారూ – తమకేదర్నీ.... ఖద్దరొడకమన్నారు. ఎల్తే జైలు కెళ్ల మన్నాడు. అంతేగాని ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్ లాటి సమస్యల మీద పుస్తకాలేనా తిరగెయ్యమన్నాడా? యంత్రాంగంలో దూరి పాలనానుభవం సంపాదించమన్నాడా? సైన్యంలో దూరి వార్‌లోనూ పీస్‌లోనూ దేశాన్ని డిఫెండ్ చెయ్యడం నేర్చుకోమన్నాడా?

నాకు తెలిసినంతవరకూ మన స్వతంత్రయోధులందరూ యీ తంత్రం సంగతొదిలేసి తక్కిన విద్దెలన్నీ తెలుసుకున్నారు. అన్నీకూడా కాదు – హిస్టరీ ల్చదివి (ఆటో) బయాగ్రఫీ ల్రాసుకున్నారు. ఎందుకూ చరిత్రలో కెక్కి పోడానికి. కొందరు కొందరు భగవద్గీతలకు వ్యాఖ్యానాలూ, రామాయణ, మహాభారతాలూ మళ్లా మళ్లా రాసేసేరు.

అంతేగాని, స్వాతంత్ర్యం వస్తే రేపు మన దేశానికేం కావాల? మనఁవేం చెయ్యాల? ఏం చెయ్యగలం? ఇలాటాలోచన ఒక్క – తప్పు – ఒక్క పెద్ద మనిషికీ వచ్చుండదు. ఎవళ్లో ఒకళ్లిద్దరికొచ్చినా ఆళ్ల పీక ఏ పెద్దోళ్లో నొక్కేసుంటారు.

అందికే ఆరోజొచ్చేసరికి రాజ్యాంగం రాయిడం కాణ్ణుండి ప్లాన్లెయ్యడం కాణ్ణుండి – ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించడానికి సరేనరి – అన్నిటికీ నాన్‌పార్టీ ఇంటలెక్చుమీదా కొండొకచో ఏంటీపార్టీ ఇంటలెక్టు మీదా ఆధారపడవలసొచ్చింది.

ఆళ్లు ప్రజారాజ్యం రామరాజ్యం అంటూనే దీన్ని రాక్షసరాజ్జెం చేసీచేరు.

ఈ వైద్యనాథం కూడా అలాటోళ్ళలో ఒకడైతే ఆడి తప్పేఁ వుందీ?

ఈడు సోషలిస్టు ప్రణాళిక, సోషలిస్టు ప్రణాళిక అంటూనే రెండు సోషలిస్టు ప్రణాళికలు తయారుచేసేసి పార్లమెంటు చేత ముద్దర్లు గుద్దించేసేడు.

ఆడేసిన ట్రిక్కేటో తెలుసా? మనకి కేపటలిస్టు ఎకానమీ వొద్దు, సోషలిస్టు ఎకానమీ అంతకన్నా వొద్దు – అన్నాడు.

మొదట్నుండీ మన నాయకుల ఆలోచనా ధోరణీ, జాతికి ఆళ్ళు నేర్పి పెట్టిన ఆలోచనా పద్ధతీ, ఒకటుంది గదా!

మాటొరసకి –

బ్రిటిష్‌వాళ్ళు మన మిత్రులా? కాదు కాదు. అయితే శత్రువులా? అబ్బెబ్బే ఎంత మాత్రం కాదు.

హిందూ మతాచారాలు మంచివా చెడ్డవా? చెడ్డవే చెడ్డవే.కాని వాటిల్లో మూఢత్వాన్ని తొలగిస్తే, ప్రపంచం మొత్తం మీద ఆ మత విశ్వాసమంత గొప్పది మరింకోటి లేదు.

ఇంకో చిన్న దానిలో కొద్దాం.

ఇప్పుడు మన పండిత భాషకి పట్టం గట్టవలెనా? జనసామాన్యం వాడు కునే సామాన్య భాషను సింహాసన మెక్కించాలా? అదీకాదు శిష్ట వ్యవహారంబే సర్వత్రా శ్రేష్ఠంబు.

ఈ నేషనల్ సైకాలజీని ఆడు యీజీగా పట్టేసేడు. పట్టేసి, రైట్టర్నా లెఫ్టర్నా – అన్న డైలమా కాడ, మనది వయా మీడియా – అంటే తిన్నగా పాతదారికే – అని జనాల్ని బొంబాయి ప్లానుకి పట్టించేసేడు.

బొంబాయి ప్లానంటే – నువ్వినావో లేదో – పందొమ్మిది వందల ముప్ఫైల్లో కావాల బోసుబాబూ – బోసుబాబు మొదట్నుండీ అన్నిట్లోనూ ఫార్వర్డేలే – మంచికేనా చెడ్డకేనా – ఆ బోసుబాబూ మరింకో యిద్దరు ముగ్గురు నేషనల్ లీడర్లూ, ఓ నేషనలు ప్లాను తయారుచేసేరు. చేస్తే దానికి ప్రత్యామ్నాయంగా దేశంలోని కోటీశ్వర్లంతా ఏకమై ఆళ్ళ ప్లానొకటి ఆళ్ళూ తయారుచేసేరు. అది గదే బొంబాయి ప్లాను.

ఆడుచేసిన మిస్చీప్ ఎక్కడంటే –

మాంసం పెలాటబుల్‌గా ఉండడానికి అటొకటీ ఇటొకటీ చిన్న బ్రెడ్ స్లయిసులు తగిలించి సాండ్ విచెస్ తయారు చేస్తారు చూశా – అలాగ పందొమ్మిది వందల ముప్పై యెనిమిదిలో రాయిస్టులు తయారుచేసిన పీపుల్సు ప్లాన్నుండి ఓ ముక్కా – సారీ యిందాక నేషనల్ ప్లానన్నాను – ఆ తరువాత యస్సెస్ అగర్వాలా మార్కు గాంధియన్ ప్లాన్నుండి ఓ ముక్కా తీసి – మొదట చెప్పిన బొంబాయి ప్లానుకి అటూ యిటూ తగిలించేసేడు. తగిలించి పార్లమెంటు ముందుకి పమ్మించేడు.

ఏటయ్యా యీ డిష్షు? – అంటే, మిక్సెడెకానమీ – అన్నాడు.

మిక్సెడెకానమీ అంటే ఏటో, అసలు ఎకానమీ అన్నమాట ఎక్కడిదో ఎంత మందికెరికా? మహ మహ చదువుకున్నోళ్ళకే దాని ఇరక బొక్కలన్నీ బోధ పడవు. దానికి తోడు మన మంది నాయకులకి శానామందికి దేని గురించీ తెలీదు. తెలుసుకోవాలన్న సంగతీ తెలీదు.

అంచేత అలవాట్రివాజు ప్రకారం అధిక సంఖ్యాక పార్టీ యస్సన్న లందరూ అగ్రనాయకుల మొకాలు చూసేరు. ఆళ్ళు – ఫరవాలేదు, కానిచ్చీ యండ న్నారు.

రెండు కోర్సులు పూర్తిచేసి మూడో దానికొచ్చేక గాని తము పుచ్చుకున్న ఫలహారం పచ్చి మాంసమనీ అందులోనూ నరమాంసమనీ కొందరు కొందరు అహింసా మూర్తులు తెలుసుకో లేప్పోయేరు.

అప్పుడు – ఏఁవిటీ ఘోర కలి? అని మొహం చించుకు అర్చి దిక్కులు చూసీ సరికి అసలు మనిషి ప్లానింగు కమీషన్లో కనపడ్డు. విద్యాపీఠం మీద ఉన్నాడు. కసి పట్టలేక ఆ పోర్టిఫోలియో మీదే దాడిచేస్తే మీ మంత్రి పదవి మీకాడే ఉంచుకోండని సీటు దిగి బయటకి నడిచీసేడు.

అయితే –

ఇది ఘోరకలే అనీ మొత్తం ప్లాన్లు బొంబాయి ప్లాన్లని సీరీలైజు చేస్తున్నాయనీ మొత్తుకోబోయినోళ్ళు లేకపోలేదు. మొత్తుకుంటే ఇనిపించుకునే వోళ్ళేరీ?

అప్పోజిషన్ మెంబర్లు సయితం సగానికి పైగా పెద్ద పెట్టుబడికో చిన్న పెట్టుబడికో తాబేదార్లే కద? – లేప్పోతే స్వయం సేవకులు. మిగిలిన జనాల్లో మూడొంతుల ముప్పాతిక మందున్నారంటే లేండ్ లార్డులు. మొదటి ప్లాన్లో వ్యవసాయ రంగం మీద స్ట్రెస్ అనీసరికి బయటికేఁవన్నా ఆళ్ళు లోపల్లోపల సంకలు గుద్దేసుకుంటున్నారు. మరి యీ మొత్తుకోళ్ల గోల ఎవరిక్కావాల? అంచేత వాళ్ళ సొద గాల్లో కలిసిపోయింది.

ఆడు మొదటి ప్లాను ఎత్తుకోడఁవే – ఎగ్రికల్చర్‌కి ఫస్టు ప్రిఫరెన్సు – అంటూ ఎత్తుకున్నాడన్నానా?

ఎందుకెత్తుకున్నాడూ? వ్యవసాయిక ఉత్పత్తులు పెరిగితేగాని ఒక టైపాఫ్ యిండస్ట్రీకి పునాదుండదు. ఆట్నే అందుకూ పెంచాలన్నాడు. వ్యవసాయదార్ల లాటు బాగు చెయ్యడానికీ కాదు, ఆహార సమస్యకి సొల్యూషన్‌గానూ కాదు. ఒకేళ ఆ రెండు లాభాలూ దేశం పొందిందంటే అవి బై ప్రోడక్టల టైపు. పత్రికలూ నాయకులూ మనకింకోలా చెప్పొండొచ్చు. ఆడు మాత్రం దంకా బజాయించి నిజఁవే చెప్పేడు.

ఇంక రెండో ప్లాను సంగతి –

దీనికెట్టిన ఎరలు అంతకన్నా నోరూరించేవి.

ప్రజలంటే ఎవరు?

పేదజనం.

పేదజనం లాటు బాగుపడాలంటే ఏం చెయ్యాల?

దేశంలో ఎంప్లాయిమెంట్ పొటన్షియల్ పెరగాల.

చిన్నవో పెద్దవో ఇండస్ట్రీలు పెట్టందే ఎంప్లాయిమెంటు పొటన్షియల్ పెరుగుతాదా?

పెరగదు.

మన్లాటి బడుగు దేశాలు పరిశ్రమలు స్థాపించ లేప్పోడానికీ, స్థాపించినా నిలదొక్కు లేప్పోడానికి కారణవేటో ఎరికా?

ఎరగం.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్డింగ్, యంత్రాలూ అరిగిపోతే ఆటిక్కావలసిన ప్రతి శీలా పైదేశాల్నుండే దిగుమతి కావాలంటే దేశం మాసిపోద్ది. అప్పులకనీ, ఆలిస్యాలకనీ, వడ్డీలకనీ నిండా పాతికేళ్ళు నిండకుండానే ఐపీ లెట్టేస్తాం. చీఁవలు పెట్టిన పుట్టల్లో పాఁవులు దూరేస్తాయి. కడకు కష్టపడి సంపా యించిన సొతంత్రాని క్కూడా కాళ్ళొచ్చీవచ్చు.

అయితే ఏటి చెయ్యాల?

శ్రమైతే అయ్యింది. చిన్నవీ పెద్దవీ భారీవీ భారంవీ – అన్నిరకాల పరి శ్రమలూ, కసింత ముందూ ఎనకా అయినా ఒక్క పాలే టేకప్ చేయాల – మనఁవే టేకప్ చెయ్యాల.

చెయ్యాలనుకున్నంత మాత్రాన చేసీగల్డుఁవా?

మనసుంటే మార్గఁ వుంటాది. పరిశ్రమల కేటేటి కావాలా? ముందుగా కావలసింది ముడిసరుకు. ఆ తరువాచ్చూసుకోవలిసేది మేన్ పవరు. ఈ రెండూ వుంటే పెట్టుబడి. ఈ మూడిట్నీ మేనేచ్చెయ్యిడానికి అనుభవం వున్న మను షులు.

రైటే. మొదటి రెండూ మనకాడున్నాయి. తక్కిన రెండో?

అయీ ఉంటాయి – మీరు కసింత ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే అందరికీ కాదుగాని మన్లో కొందరికి ముందుసూపు అసల్లేదు.

ఉంటే – అజ్జాతీయం సేసేస్తాం, ఇజ్జాతీయం చేసేస్తాం – అని ఆదికి ముందు స్టేటు మెంట్లివ్వరు. దాన వల్లేటయ్యిందీ డబ్బులున్నోళ్ళు ఆస్తులున్నోళ్ళు బెదిరిపోతున్నారు. ఇండస్ట్రీలో నిలదొక్కుకున్నోళ్ళకైతే అన్నీ అనుమానాలే. ఈ పరిస్థితి మారితే తప్ప ఆ రెండు వనర్లూ మన కాదుండీ లేనట్టే.

పరిస్థితి మారాలంటే, ఏం చెయ్యాల?

ఏఁవీలేదు. ఇప్పుడున్న పెట్టుబడి ఎందలున్న దందులోనే ఎలాగున్నదలాగే ఉండనియ్యాల. దాని యాజమాన్యం జోలికి మేం – రాం అనాల. మీరు పరి శ్రమలెడితే మేం సాయం జేస్తాం – అనాల. అప్పుడు డబ్బున్నోళ్ళకి నమ్మకం పుడతాది. సాహసఁవున్నోళ్ళకి ఆశ పుడతాది. పుడితే మన పెట్టుబడికి పొటన్షియల్ పెరుగుతాది. మరింకో సంగతి, మాజీ సంస్థానాధీశులకీ మరికొకళ్ళకీ ఇంకొకళ్ళకీ మనం నష్టపరిహారాలిస్తున్నఁవా, ఇంకా ఇస్తాఁవా, ఆ డబ్బంతా పరాయి దేశాల్లో పైపై సరదాలకి ఖర్చైపోకుండా ఇటుకాసి దిగి సద్వినియోగఁవవుతాది, లేప్పోతే, అదేకాదు, ఆళ్ళ తాతముత్తాతలు భూగర్భాల్లో దాచిపెట్టిం దాంతో సహా, మొత్తం – ఎప్పటికో అప్పటికి పరారీ అయిపోతాది.

అదీ నిజఁవే.

అక్కడి దాకా తోలుకొచ్చేక ఆడు తన మిక్సెడెకానమీ యొక్క అసలు ఐడియా చెప్పుకొచ్చేడు.

ఎద్దు కెద్దు కలిస్తే జోడౌతాది. ఒట్టి ప్రజాధనంతోనే పరిశ్రమ లెడదాఁవంటే ఏ పాటి బకరగలం? అంచేత అన్ని వర్గాలనీ కలుపుకోవాల. అయితే యిక్కడ ఓ చిన్న చిక్కుంది. మావీ, రాజుగారివీ కలిసి వెయ్యావులెక్కకి ఎవరైనా ఒప్పుకోవచ్చు గాని, సోలిడ్ కేషిచ్చే ధనవంతు లొప్పుకోరు. అందుకని మొత్తం పెట్టుబడిని రెండు సెక్టార్ల కింద ఇడదీసెయ్యాల. ప్రజల పెట్టుబడితో, ప్రజలెన్నుకున్న ప్రభుత్వం నడిపే పరిశ్రమలన్నీ పబ్లిక్ సెక్టారు. పెట్టుబడు న్నోళ్ళు షేర్లో, వాటాలో ఏసుకుని నడిపేవి ప్రైవేటు సెక్టారు. ఈ రెండు సెక్టార్లనీ వలపలి దాపలి ఎడ్లలాగ వలపక్షం లేకుండా నడిపిస్తేనే మిక్సెడెకా నమీ సక్సెసు. రెండింటి ప్రయోజనాలకీ క్లాషురాకండా, ఒక దాని మీదొకటి కాంప్టీషన్కి దిగి రెండూ మసైపోకండా, దాన్నిదీ, దీన్నదీ సప్లిమెంటు చేసే పద్ధతిలో రెండూ ఆరోగ్యంగా పెరగడానికి స్కోపిస్తూ కొన్ని కొన్ని పరిశ్రమల్ని పూర్తిగా ప్రైవేటు సెక్టారికీ, మరికొన్నిటిని పబ్లిక్ సెక్టారుకీ కేటాయించేయాల. ఇదిగిలాటి ఏర్పాటువల్ల మొత్తం రిసోర్సెస్సన్నీ ప్రొడక్షను ఏక్టివిటీకి గేరైపోయి ఏబై ఏళ్ళలో సాధించగలిగే ప్రోగ్రెస్ పాతికేళ్ళలో సాధించొచ్చు. ఇదీ నా ప్లాను – అన్నాడు.

సోషలిజం మా ధ్యేయం అంటూ, మళ్ళా ప్రైవేటు పెట్టుబడీ, ప్రజలకన్నా ముమ్మాటు పుట్టినట్టు ఆళ్ళకి ప్రత్యేక సదుపాయాలూ – ఇదంతా ఏటయ్యా? అంటే –

అయ్యా, మీ ప్రభుత్వఁవా కొత్తది. నెత్తి మీజ్జూస్తే సవాలక్ష నమన్యలు. వ్యాపారాలనగా వరిశ్రమలనగా – డెడికేషనుంటేగాని నెగ్గవు. మీరు సెటిలవ్వండి. ఇండస్ట్రీ అంతటినీ పబ్లిక్ సెక్టారు ద్వారా మేనేజ్ చెయ్యగలఁవని మీ కెప్పుడనిపిస్తే అప్పుడే ఒక్క కలంపోటుతో లాగేసుకోవచ్చు. ఎట్టిన ఇండస్ట్రీలెటు పోతాయి? అన్నాడు.

లాజిక్కు బాగుంది కదా?

నరే – అయితే ఏయే వరిశ్రమలు వబ్లిక్ సెక్టారుంచుకోవాల, ఏవి ప్రైవేటుకొదలాల?

అన్నిరకాల భార పరిశ్రమలూ, ఆట్నే హెవీ ఇండస్ట్రీస్ అంటారు. ప్రభుత్వమే చేపట్టి; భారీ పరిశ్రమలు కొన్నీ, పంచదారా, బట్టలూ లాటి చిల్లర శివాలక్ష్ములు ఎన్నున్నాయో అన్నీ, ప్రైవేటు కొదిలీడం సబవు – అన్నాడు.

ఇదిగిక్కడి కొచ్చేసరికి, పిల్లి ఇలాగ తల బైటికెత్తడం కనపడతాది – చూసినోడికి.

భార పరిశ్రమలంటే, మీరినే ఉంటారు. ఇనుము, ఉక్కు తయారీ చిన్నా పెద్దా పరిశ్రమలకు కావలసిన యంత్రాలూ, యంత్ర పరికరాలూ తయారు చెయ్యటం వగైరా వగైరాలు.

సిమెంటూ, సైకిళ్ళు, బట్టలూ, పంచదారా లాటి కన్స్యూమర్ గూడ్సు తయారీయే పెద్దత్తునైతే భారీ పరిశ్రమ లంటారు. చిన్నెత్తునైతే చిన్న పరిశ్రమ లంటారు.

అయితే –

గుణింతఁవే తేడాలా కనపడతాది గాని, భార పరిశ్రమకీ, భారీ పరిశ్రమకీ తేడా సచ్చినంతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే నెత్తిమీది బియ్యబ్బస్తా భార పరిశ్రమైతే కడుపులో కెళ్ళే పరమాన్నం లాంటిది భారీ పరిశ్రమ.

ఆడేటన్నాడంటే –

భార పరిశ్రమలకి కోట్లకి కోట్లు, పెట్టుబడి కావాల కదా? దేశంలో కోటీశ్వర్లందరి చింకి కోట్లూ పోగేసినా ఒక్క భార పరిశ్రమకైనా సరిపోవు కాదా? ఫర్ లవ్ ఆర్ ఇంటరెస్టు ప్రజల పేర్న అడిగితే, విదేశీ సాయాలు పుట్టించడం యీజీ. కాబట్టి భార పరిశ్రమలన్నింటినీ పబ్లిక్ సెక్టార్లో ప్రభుత్వమే చేపట్టాలా – అన్నాడు.

నిజఁవే. ఒక దేశంలో ప్రజ ఎంత పేద ప్రజైనా, ఆ దేశంలో కోటీశ్వర్లు ఎంత గొప్ప కోటీశ్వర్లయినా, పరపతికాడ కొచ్చేసరికి ప్రజల్దే పరపతి.

ఇలాటి సంగతులు మనకైతే తెలీవు, తెలీనీరు. కాని ఆళ్లాటోళ్లకి తెలుసు గదా? అందికే భారపరిశ్రమలు ప్రజలు పెట్టగలరన్నాడు.

మామ్మూలుగా చూసినా ఆడన్నదే సబవనిపిస్తాది. అంతేకాదు సోషలిస్టు కంట్రీస్ ఎగ్జాంపులు కూడా కొంత ఉంది.

కాని ఇందల గజి బిజి ఎక్కడుందంటే –

తరవాత్తరవాత తామే టేకప్ చేయదలచిన చిన్న పరిశ్రమల కోసం ముందుగా భార పరిశ్రమలు స్థాపిస్తాయి – ఏవి? సోషలిస్టు దేశాలు. అంటే ప్రజల సదుపాయం కోసఁవే ప్రజలు పెట్టుబడి పెడతారు – అక్కడ.

ఇక్కడో – లైట్ ఇండస్ట్రీస్ లార్జిస్కేల్ ఇండస్ట్రీస్, రెండూ చిన్నా పెద్దా ప్రయివేటు పెట్టుబళ్ళకి రిజర్వేషన్ అనీ సేవ. ఆళ్ళు అలాగ పెరగాలన్నావు. ఆ పెరుగుదలకి ఎక్కడాటంకం అయిపోద్దో అని, అంటే – పై దేశాలనుంచే యంత్రాలూ, అవి చెడిపోతే ఆటి పార్టులూ, తెచ్చుకోడంలో శానా యిబ్బందు లున్నాయని ఇందాకన్నాను కదా – అందుకని, పబ్లిక్ సెక్టార్‌లో ప్రజల్చేత భార పరిశ్రమలు టేకప్ చేయిస్తున్నావు.

అంటేఁవన్న మాటా? పుట్టబోయే నీ పులి పిల్లల శ్రేయస్సు కోసం పురిటికి ముందే బలి సిద్ధం చేస్తున్నావన్నమాట.

మిక్సెడెకానమీ పేరుతో ఆడు చేసిన వంచనలో నేర్పూ, ప్లాన్ల పేరుతో ఆడి విష వృక్షానికి ఆడు తయారు చేయించిన పెద్దసైజు పాదూ, ఎతికితే ఇక్కడే యీ స్టేజీలోనే కనిపిస్తాయి.

అయితే, భార పరిశ్రమలు ప్రొడక్షన్ ఆరంభించి ఏడాది ఏణ్ణర్థం గడి చిందాకా, ఆడి అసలు డిజైన్ ఏటో, అణ్ణి ఔనన్నోళ్ళకి కాదు కాదన్నోళ్ళకి కూడా అర్థం కాలేదు.

భార పరిశ్రమలతో పెట్టుబడి చిక్కొక్కటేకాదు – తక్కిన చిక్కులు కూడా బోల్డన్ని ఉన్నాయి. అందల ప్రథమ చిక్కు మార్కెటింగ్.

కన్సూమర్ గూడ్సు కొనీ జనం కోట్ల మీద ఉంటారు. ఇప్పుడు బట్టలనగా సబ్బులనగా ఇలాంటివన్నీ కన్స్యూమర్ గూడ్సు. అవి లేప్పోతే చాలామందికి రోజువారీ జీవితం గడవదు. కొనే జనం సంఘాలుగా ఏర్పళ్ళేరు. ఎవడికాడు అమాయకుడు. ప్రొడక్షన్ కాస్ట్ ఎక్స్ మిల్‌రేట్ రిటేల్ ప్రైస్ అంటూ నువ్వెన్ని ముద్దర్లు గుద్దినా ఆళ్ళకా గందర గోళం అర్థం కాదు.

కొట్టోడు దీంధర ఇంతంటే ఇంతే కావోసనుకుంటారు. ధరలు పెరిగేయంటే కావోసనుకుంటారు. నీలాటి నాలోటోడు, ఎందుకు పెరిగేయి ఎలా పెరిగేయని కొట్టోడితో ఐదు పదినిమిషాలు వాదనేసుకున్నా ఫాలో అప్ ఉండదు. నూటికి తొంభై తొమ్మిది మంది – భూమ్మీద చెట్టూ పుట్టా చీమా దోమా మనిషీ మానూ యియన్నీ ఒకెత్తుకు పుట్టి ఇంకో ఎత్తుకు పెరిగినట్టే ధరలు కూడా పెరగడం సహజమే అనుకుంటారు.

అంచేత కన్స్యూమర్ గూడ్సు తయారు చేసే వోడిదీ, అమ్మే వోడిదీ, ఆడింది ఆట, పాడింది పాట.

భార పరిశ్రమలు తయారుచేసే వరకు సరుకు అమ్మాలంటే అలాక్కాదు. వాడకందార్లు స్వదేశీయులు గాని విదేశీయులుగాని – పారిశ్రామికులు. అంటే లాభాల వేటల్లో ఆరితేరిన వీరపులులు. ఈళ్ళతో వ్యవహారాలకి దిగే మనుషులు యీళ్ళకి అలివికాని జంతువులైతే తప్ప యీజీగా ఆళ్ళని భక్షించేస్తారు.

మీకు జంగిల్ లైపు గురించి తెలుసో తెలీదో. ఇప్పుడీ పులులూ సింహాలూ సివంగులూ ఉన్నాయంటే – అవి మన మేకలూ ఆవుల లాగా బతకవు. మనవన్నీ మంద జీవాలు. అవన్నీ బహు చలాగ్గా ఎల్లవేళలా ఎలర్ట్‌గా ఉం టాయి. ఆటికి అట్‌మోస్ట్ ఫేమిలీయే యూనిట్. అవైనా అల్లా మేటింగ్ టైమ్‌లో నాకేసుకుంటే నాకేసుకోవచ్చుగాని మేతకాడ కొస్తే ఒక దాని పొద యింకో దానికి గిట్టదు. ఒక్క గుహలో కాపరం ఉండే మెకాలు కూడా తగువొచ్చి దెబ్బలాటకి లంకించుకున్నాయంటే అడవి దద్దరిల్లిపోవలసిందే.

ఫేమిలీల్లోనే ఆటిపొత్తు యిలాగుంటే ఇతర క్రూర మృగాలతో ఆటి సయోధ్య గురించి ఏరే చెప్పనక్కర్లేదు.

అయితే –

వేటకాడి కొచ్చేసరికి ఇంత ఒంటరిగొట్టు జీవాలూ ఎలా అయిపోతాయో అన్నీ ఒక్కపాలి ఏకఁవైపోతాయి. అవి ఏ అడివి మృగాలేనా కావొచ్చు. ఏ జాతి మృగాలేనా కావచ్చు. జంతువుని ఏసే దగ్గర ఆటిలో పోటీ లేదు. అనుకోకుండానే అన్ని మెకాలూ టీమైపోతాయ్.

నన్నడిగితే వాణిజ్యవేత్తలూ పారిశ్రామికులూ సరీగ్గా అలాటోళ్ళు.

అప్పర్ క్లాసుకి చెందిన ఈ భద్రలోగ్ అందరూ సనసన్నగా ఆర్గనైజ్ కాడానికి రకరకాల వేదికలున్నాయి. ఆటిల్లో క్లబ్బులు ఓరకం. నాలుగు డబ్బులు చేరిన, చేరుద్దాఁవన్న, ప్రతీవోడూ ఏదో ఓ క్లబ్బులో మెంబరై ఉంటాడు. రోటరీలనీ, సింహాల క్లబ్బులనీ ఆ క్లబ్బులో మళ్ళా తేడాలు.

ఇప్పుడు సింహాల క్లబ్బు సభ్యులున్నారంటే, ఆళ్ళందరిదీ ఓ ఫ్రాటర్నటీ. ప్రతి చిన్నపట్నంలోనూ, యీ మధ్య బస్తీలో కూడా, యీళ్ళకో క్లబ్బుంటాది. ఊరికో ప్రెసిడెంటూ జోనుకో చేర్మేనూ, జిల్లాకో గవర్నరూ – జిల్లాలంటే మన జిల్లాలు కావు. ఆళ్ళ సరిహద్దులు వేరు. రెండేసి మూడేసి స్టేట్లు ఓ జిల్లా – ఇలాగ ఒక దానికొకటి లింకు చేసుకుంటూ మొత్తం ఇదో వరల్డువైడ్ ఆర్గనైజేషనట. మన ఇండియన్ లైను హుడ్ ఆ చైన్లో ఓ లింకు.

ఈ లింకులో నాయకుడుంటాడు. మొత్తం నెట్ వర్కుకి

పెద్ద "లైన్సు ఇంటర్ నేషనల్ ప్రెసిడెంట్", ఆడు ఏ అమెరికాలోనో ఉంటాడు. ఆడు నూటనలభై తొమ్మిది దేశాల్లో మూడువందల ఇరవై జిల్లాలకి అధిపతట.

అలాగే రొటారియన్లు.

పేరుకివి ప్యూర్లీ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్సు. సర్వీస్ ఎబౌసెల్ఫ్ – ఆళ్ల మోటో. ప్రపంచదేశాల పెద్దల్తో చేతులు కలిపి బడుగుదేశాల పెద్దలుచేసే సెల్ఫ్ – లెస్ సోషల్ సర్వీసు ఏటో మీరూహించుకోండి.

ఇలాంటి వెల్ అండ్ వైడ్లీ ఆర్గనైజ్డు, కేలిక్యులేటింగ్లీ ఇంటలిజెంట్ అండ్ రూత్లెస్ గ్రీడీ పీపుల్ ఓ రకం ప్రోడక్ట్సుకి కొనుగోలుదార్లు.

ఏ ప్రొడక్ట్సుకీ? ప్రజల డబ్బుతో పబ్లిక్ సెక్టార్ల తయారయ్యే హెవీ ఇండస్ట్రీస్ ప్రొడ్యూస్ చేసే యిండస్ట్రియల్ గూడ్సుకి.

ఈ కొనుగోలుదార్లతో పైన చెప్పిన ఇండస్ట్రియలిస్టులు తయారుచేసే కన్స్యూమర్ గూడ్సు కొనుగోలుదార్లు – అంటే జన సామాన్యం – ఆ జన సామాన్యాన్ని సరిపోల్చండి.

ఇంక నెంబర్ ఒన్ కొనుగోలుదార్లకి ఎదురుగా అమ్మకం దార్లెవరయ్యా –

సొమ్ముకడిదీ, సోకొకడిదీ, అని సాఁవెత చెపతారు జూసా – అలాగ ప్రజల సొమ్ముకి ట్రస్టీలు ప్రభుత్వంవారు పెట్టుబడిపెడితే, ఆ పెట్టుబడితోగాని దాని లాభనష్టాలతోగాని ప్రమేయంలేని, పెద్ద పెద్ద జీతాలూ, అనరోరియమ్లూ లాగే నిపుణులు – వ్యాపారాలు నడిపిస్తారు.

ఈళ్ళు పెంచుకునే ఆస్తులికి సీలింగుల్లేవు. అడిగినా లెక్క లప్పజెప్పవలసిన బాధ్యత ఆళ్ళకుంటాదిగాని, తీసుకోరు. ఈ జనం సాధారణంగా అప్పర్ క్లాస్ అయ్యుంటారు – లేప్పోతే ఈ క్లాసు జీవితం కోసం తహతహలాడే అధమవర్గాలేనా కావచ్చు – ఎవలేనా, ఇలాటి ఈ ధర్మకర్తలే ఆ పులుల్తో బేరాలాడ్డం ప్రోడక్ట్సు అమ్మడం.

ఇంక మరి, ఆ బేరాలెలాగుంటాయో, బేరసారాల్లో పట్టువిడుపులు ఏ ఇంటరెస్ట్తో సాగుతాయో, అసలు ఆళ్ళకీ యీళ్ళకీ ఎలాటి మేచో, అందులో ఎవరు నెగ్గగలరో ఎవరు నెగ్గినా కొనకొచ్చేసరికి లాభాలెవరివో – అవన్నీ మీరే ఊహించండి.

ఇదీ, ఇలాటి చిక్కులన్నీ మన పెద్దలు ఆలోచించినట్టు లేదు. లేక, కొంద రన్నట్టు సంగతంతా తెలిసే తెలీనట్టు నటించేరో – మొత్తానికి రెండో పంచవర్ష ప్రణాళిక పేరుతో ఆడు దిగమన్న ఊబిలోకి దిగిపోయేరు.

ప్రభుత్వంవారు ఇక్కడ బరికీ అక్కడ బరికీ, ఆడ్డంవైన దేశాల కాడా అప్పుల్చేసీ, ఇంకా చాలక ముష్టెత్తీ, ఎలాగైతేనేం ప్లాను పూర్తిచేసేరు. భార పరిశ్రమలు ప్రొడక్షన్ ఆరంభించేయి.

ఆరంభించిన తరువాత అవలా సాగుతూనే ఉన్నాయి.

ఏడాది గడిచింది. ఏణ్ణర్థం గడిచింది. ప్రోడక్ట్సు తయారౌతున్నాయిగాని ఆటికి గిరాకీ లేదు. యార్డులో దంపై పోతున్నాయి.

దొంగలు కూడబలుక్కున్నట్టు దేశవాళీ పారిశ్రామికుల్లో ఒక్కడూ ముందుకి రాడు.

పోనీ ఫారిన్ మార్కెట్కి తరలిద్దాంవంటే మనకి మార్కెట్లు లేవు. ఉన్న ఆ ఒక్క కామెన్వెల్తు మార్కెట్లోనూ మన గూడ్సుకి డిమాండ్ లేదు. ఎన్నాళ్ళనుండో ఇండస్ట్రీలో పాతుకుపోయిన దేశాలు – బ్రిటననగా, కెనడా అనగా, అలాటి దేశాల్తో మనం పోటీ పడగలంవా? పడలేం. పడలేప్పోయాం.

అప్పుడు దేశంలో పెట్టుబడి పెట్టగలోళ్ళనే పిలిపించి మాట్లాడితే ఆళ్ళేటన్నారూ –

మా దగ్గిర పెట్టుబడి లేదండీ అన్నారు. ఉన్నా మీరేదో సోషలిజం అంటారు, జాతీయాలంటారు. మాది చీంవూ నెత్తురూ కూడేసిన డబ్బులు – పెట్టుబడి పెడితే, ఆ తరవాత జాతీయంవంటే, మాగతేం కావాలన్నారు.

ఏంవవుతాది – జాతీయంచేస్తే కాంపెన్సేషనిస్తాం కదా అన్నారు.

అంటే – ఏదో ముతక సాఁవెత చెప్పినట్టు, మీరిచ్చే కాంపెన్సేషన్ మాకు 'దేనికీ' చాల్దు పొమ్మనీసేరు.

మా పల్లెటూళ్ళలో తగువుకి బయల్దేరితే – ఏటి చిక్కంతగువా చిక్కిం తగువా అని అడుగుతారు. చిక్కిం తగువంటే అవతలోడి పిలక నీ చేతిలో ఉందన్న మాట. అలాగా ఆళ్ళకది చిక్కిం తగువై పోయింది. అంచేత ఎంత నీలుగుదన్నా నీలుగుతారు.

ఎప్పుడైతే ప్రభుత్వం పొజీషను ఇరకాటంలో పడిందో, పడి గాడిదల్తో కాళ్ళబేరానికి దిగిందో అప్పుడు – ఇందాక చెప్పేను కదా జంగిల్ లైఫులో వేట వృత్తాంతం – అలాగ దేశంలో పెద్దలంతా కూడబలుక్కోకుండానే టీమైపోయి తమ తమ తాబేదార్లకి టకటక ఇన్స్ట్రక్షనిచ్చీసేరు. ఆళ్ళు నాలుగు మూలల్నుండీ ఒకేపాలి ప్రభుత్వం మీదికి కమ్మేసుకున్నారు.

ఇటు పార్లమెంటులో ప్రశ్నలమీద ప్రశ్నలు దాడి. అటు ప్రెస్లో వ్యాసాలమీద వ్యాసాలు, ఎడిటోరియల్సైతే ఒన్ టూ త్రీ అని – మన లేడీ రైటర్సు రాస్తారు సీరియల్సు – అలాగ సీరియల్సే.

ప్రెస్సంటే గుర్తుకొచ్చింది. ప్రెస్సంటే మీకో చిన్న ఇన్ఫర్మేషన్. ప్రెస్సె లాంటిదంటె – ప్రెస్ – అన్నాడు. ఓ పొలిటికల్ ఫిలాసఫరు.

దాని సాయింతో ప్రభుత్వాలను తక్తు మీదికెక్కించడం, ఎవహారం బాగులేదంటే ఆట్ని దింపీడం – ఇలాటివే కాదు;

పనికొస్తాదూ పైకెత్తాలీ అంటే మశికాల్లాటి పీనుగుల్ని పట్టుకొని మహాగజాల స్థాయికి పెంచీగల్రు; పెంచి, ఎదురు తిరిగినా పనికి రాప్పోయినా ఆ మహాగజాల్ని మళ్ళా మక్షికాల సైజుకు కట్ చేసీగల్రు.

అందికే ఎంతెంత కొమ్ములిరిగిన నాయకులేనా, రాజకీయ రంగంలో ఎంతటి అసహాయశూరులైనా పత్రికాధిపతుల దగ్గిరి కొచ్చీసరికి – ఆ మాటకొస్తే ఆళ్ళ తాబేదార్లతో కూడా – మర్యాదగా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తారు. ప్రెస్ బ్రీఫింగ్ మిషతో ఆళ్ళను కుషామత్ చేసీ, పెద పెద్ద నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఆళ్ళను కాన్ఫిడెన్సులోకి తీసుకున్నట్టు నటించీ ఆళ్ళను మచ్చిక చేసుకుంటారు. యిలాగ యీ దేశంలోనే కాదు – జనరల్‌గా అన్ని దేశాల్లోనూ ప్రెస్‌తో నాయకుల వ్యవహారం ఇలాగే ఉంటుంది.

ఈ దేశంలో కూడా మూడొంతుల ముప్పాతికి ప్రెస్ తెరవెనుక పెద పేద్ద పెద్దల్దే. ప్లాన్లు ప్రవేశపెట్టేముందు ఆళ్ళేం చెప్పేరో యీళ్ళేం అండర్ స్టాండింగ్ కొచ్చేరో అప్పుడల్లా ప్లాన్లనీ ప్లానింగు విధానాన్నీ దాదాపు అన్ని పత్రికలూ సపోర్టు చేస్తూనే రాసేయి. ఇప్పుడూ పత్రికలే యజమాన్లు ఉసి ఇచ్చీసరికి పబ్లిక్ సెక్టారుమీదా ప్లానింగ్ వ్యవహారం మీదా పతాక శీర్షికలెత్తేసి దాడికి దిగిపోయేయి.

మరి దిగిపోవా?

పెద్ద పెద్ద కాలమిస్టులైతేం ద సోకాల్డు ఇండివిద్యువలిస్టు ఎడిటర్లైతేనేం ఓ అప్రెషన్ కాడో, ఓ సప్రెషన్‌కాడో అయితే ఆళ్ళ అంతరాత్మలకి విరుద్ధంగా నైనా గవన్మెంట్ మొఖమాటానికి లోబడి దాన్ని సపోర్టు చెయ్యొచ్చు. కాని రియల్ మేటర్సు – డబ్బూ పవరూ ఇన్వాల్వైన చోటా ఆళ్ళ యజమాన్ల ఇంటరెస్టులు స్టేకులో ఉండేటప్పుడూ మొగమాటాలూ లాయల్టీలూ పని చెయ్యవు. చేస్తే ఆళ్ళు ఫోన్లుకీ కార్లకీ రెంట్ ఫ్రీ అపార్ట్‌మెంట్‌లకీ తిలోద కాలిచ్చుకోవాలి.

అయితే యీ సంగతి పదవిలో ఉన్నోళ్ళకి తెలుసు. అంతేకాదు ఆళ్ళదీ ఆళ్ళ యజమానుల్దీ గేమేటో కూడా తెలుసు. తెలిసి మాత్రం ఏం చేస్తారూ? ఏఁవీ చెయ్యిలేని స్థితిలో పడ్డారు.

ఇంతకాలం ప్రభుత్వంవారు స్థాపించిన పరిశ్రమల్తో భూలోకం సొర్గలోకం అయిపోతుందన్న భ్రమల్లో ఉన్నారు జనం. ఇంటా బయటా కూడా సోషలిస్టు ఎకానమీకి మిక్సెడెకానమీ వారధి అన్నట్టు రూపించేవు నిన్నటిదాకా.

ఇప్పుడు –

ప్రజారంగంలో పరిశ్రమలు బతకలేవు – అని బోల్డుగా ఒప్పేసు కుంటావా? ఒప్పేసుకుంటే జనం నెత్తిమీద యీకలుంచరు.

సరే! యీకలుంటే ఉంటాయి, పోతే పోతాయి. అలా అని నిజం దాస్తావా? ఒప్పేసుకుంటావు. ఒప్పేసుకున్నాక?

పెట్టిన పరిశ్రమలు అప్పగిస్తే, భరించడానికి గుత్తపెట్టుబడిదార్లు ఒక్కళ్ళే సమర్థులు – అదీ ఫారిన్ కొలాబరేషన్‌తో. ఆళ్ళూ యీళ్ళూ కూడా అందుకు రడీయే. ఈ అరుపులూ ఆర్భాటాలూ దుమ్మెత్తిపోతలూ – ఈ దాడంతా దేనికి? నిన్ను అక్కడికి తరఁవడానికే. అలా అని ఆళ్ళప్పగిస్తే యీ దేశాన్ని మరింకో అరబ్‌కంట్రీ – చేసీదానికి చిన్న పెట్టుబడిదార్లు జంకరు.

ఎవరికీ అప్పగించకుండా వెనకట్లాగే పడిపేద్దాఁవంటే మార్కెటింగ్ లేని ప్రొడక్షను ఎంతకాలం సాగించగలం?

తాత్కాలికంగా మూసేద్దాఁవన్నా –

కోట్లకొద్దీ పెట్టిన పెట్టుబడి – అదీ అప్పుచేసొండిన పప్పుకూడు, దేశంలో జనాలూరుకున్నా అప్పులిచ్చిన జనాలూరుకోరే!

కాదు – ఆళ్ళనీ ఊరుకోబెడతాం.

అంతకాలం ఆటిమీద బతుకుతున్న వర్కర్లో? నేచురల్ కోర్సులో నిరుద్యోగం ఎన్నిరెట్లు పెరిగినా అదో సంగతి. ఫరవాలేదు. చిన్నవో పెద్దవో జీతాల కలవాటుపడ్డ ప్రాణులు – ఈ వర్కర్లు. ఆళ్ళనిప్పుడు టీ నీళ్ళక్కూడా టికాణా లేకండా డిప్రమోట్ అయిపోండంటే ఆళ్ళూరుకుంటారా? ఆ భూతగణాలు ఎక్కడెక్కడి భూతజాతినీ నిద్దర్లేపుకొస్తాయి. దక్షయజ్ఞం మరోసారి రిపీటైపోద్ది.

ఎందుకొచ్చిన దొంక తిరుగుళ్ళు; ఆ ఇండస్ట్రియల్ గూడ్సుతో ఆ చిన్న పరిశ్రమ లేవో ప్రభుత్వమే నడిపితే సరిపోదా అన్న సలహాలు కూడా ఒచ్చేయి.

నడపొచ్చు. కానీ ఎంత చిన్న పరిశ్రమకైనా ఎంతో కొంత పెట్టుబడి ఉండాలి కదా? ఉన్న నేషనల్ రిసోర్సెస్సన్నీ పబ్లిక్ సెక్టారులో భార పరిశ్రమలకే సరిపోలేదు!

అసలు ట్రెచరీయే అక్కడుంది.

దెయ్యాలకే పిండి చాలని స్థితిలో నిన్ను పెట్టేస్తే దెయ్యప్పిల్లలెలాగా నీ పీక పిసికేస్తాయి. మొత్తం ప్లాన్‌లో ట్రిక్కే అది.

అంచేత – అప్పుడు – అన్ని దర్వాజాలూ మూసుకుపోగా, విజార్డ్ ఆఫ్ ద సొదిండియా చాంబరాఫ్ కామర్సు వారు తెరుచుంచిన గేటు దగ్గిరకే వచ్చేరు ప్రభుత్వం వారు. వచ్చి–

మదుపుకి డబ్బుల్చాల వన్నోళ్ళకి బ్యాంకుల్చేత అప్పు లిప్పించీ, ఇండియన్ గూడ్సు కాస్ట్లీ అంటే మిషీన్లమీద సబ్సిడీలిచ్చీ, అడక్కముందే ఫారిన్ కాంపిటీషన్నుండి ప్రొటెక్షనిచ్చీ, అడిగినట్టూ అల్లరిపడ్డట్టూ నిరూపించి కొన్ని

కొన్ని టాక్సుల్నుండి ఎగ్జంప్షనిచ్చీ ప్రభుత్వమే కొంతమంది బీద పారిశ్రామికు ల్చేత పరిశ్రమలు పెట్టించింది.

ఆ బీద పారిశ్రామికులు ఆవిధంగా బలవంతాన పరిశ్రమల్లోకి దిగి కొంతమంది కోటీశ్వరులయ్యేరు. మరి కొంతమంది పెద్ద కోటీశ్వర్లు తమకి దొరికిన లైసెన్సులు – రాయితీలతోసహా, అమ్మి పిల్ల కోటీశ్వర్లయ్యారు. ఇంకా కొందరు రాయితీలన్నీ రాబట్టుకొని కన్వీనియంట్‌గా ఐపిలు పెట్టేరు.

కుట్రంటే అదీ కుట్ర.

ఐదువందల అరవై ఆరు పెద్ద పెద్ద సంస్థానాల్ని ఏఁవీ కానట్టు యూని యన్లో కలిపేసుకున్నారు. దేశంలో చిన్నా పెద్దా జమీందారీలన్ని ఎబాలిష్ చేసీసేరు. ఇనాంలు సరేసరి. ఇలాటి యీ ప్రోగ్రసివ్ ప్రభుత్వం మనమీద ఎప్పుడు పడుతుందో మన్నేం ముంచేస్తుందో అని, దేశంలో కోటీశ్వర్లూ పారిశ్రామికులూ గుబ గుబ లాడిపోతున్న సమయంలో –

అతి నేర్పుగా

ఆ ప్రభుత్వానికి బంగారు బాతుగుడ్ల కథ అమ్మి, త్రినాథ వ్రతకల్పంలాగ దానిని మననం చేయించి, నేషనల్ రిసోర్సెస్ ఎటు పోతాయి బయటనుండి కొట్టుకురండని అప్పుల్లో ముంచి, తెచ్చిందాంట్లో మేజర్‌పార్టు చెత్తా చెదారం ప్రోజక్టులమీద ఖర్చు చేయించి, చాలీచాలని డబ్బుతో మేజరు ప్రోజక్టుల్లో కిరికించి, అదీ ఓ ఎకానమీయే అని లోటు బడ్జెట్ రొంపిలో దింది, ఈ మొత్తం ప్రాసెస్‌లో అటు బురాక్రసీని ఇటు రూలింగ్ పార్టీనీ టాప్ టు బాటమ్ కరప్షన్లో ముంచి, ప్రజల్లోనూ ప్రతిపక్షాల్లోనూ ఆత్మవిశ్వాసఁవన్న పదార్థం మచ్చుకు మిగలకుండా చెదరగొట్టేసి, ఆర్థికంగానే కాకండా రాజకీయంగా కూడా మొత్తం దేశాన్ని ఓ అరాచకస్థితికి తీసుకొచ్చి –

ఆ దిక్కుతోచని స్థితిలో – ఆ ప్రోగ్రసివ్ ప్రభుత్వాన్నే ఆ కోటీశ్వర్ల గుప్పిట్లోకే నడపీడఁవంటే మాట్లేటి? అది మామ్మోలు పద్ధతుల్లో జరిగిదా?

ఇదేదో కుట్రేనా అయ్యిండాల, లేదా మనం నమ్ముకున్న నాయకులు దొంగల్తో షరీకేనా అయ్యిండాలి.

దేశానికి మణిదీపం జవహర్‌లాల్ నెహ్రూ ఏఁవన్నాడు?

నేనింతా జనం కోసం నా ప్లాన్లన్నీ ఏయిస్తే కోటీశ్వర్లు మరీ కోటీశ్వర్లయి పేదవాళ్ళు మరీ పేదవాళ్ళయి పోయేరన్నాడు. అదీ ఎలాగా? కళ్ళనీళ్ళెట్టుకుని.

ఆయన అబద్ధఁవాడతాడా? లోపాయి కారీలూ, లోగుట్టూ మనకి తెలీక పోవచ్చు. ఆయనకి తెలీవా? లేపోతే ఆయనవి మొసలి కన్నీళ్ళుందాఁవా?

అంచేత యీ ప్రోసెస్‌లో ఎక్కడో ఏదో కుట్ర జరిగిందన్నది ఖాయం. నా ఇన్ఫర్మేషన్ తప్పు కావచ్చు. నా ఇన్ఫరన్సు మాత్రం తప్పుకాదు. కాదనడానికి నాకు నెహ్రూయే సాక్ష్యం. నీకు నీ కళ్ళముందున్నదే సాక్ష్యం.

అలాగ కోట్లకొద్దీ జనాల్ని దగా చేసేసి, నోర్లేని ఆ జనం కరువూ, కాటకాలూ, నిరుద్యోగంతో దిక్కుతోచక అల్లాడుతుంటే ఉన్న కోట్లు చాలక యింకా యింకా కోట్లమీద కోట్లు కూడేసే వారందరూ క్షేమంగానే ఉన్నారు.

ఎంచేతా? వాళ్ళు చేసే ఘోరాలూ, దగాలూ అన్నీ లాఫుల్ గానే జరుగు తుండి ఉండాలి.

లేపోతే అతివాదుల్నో, ఉగ్రవాదుల్నో అడువుల్లో దాగున్నా మాటుకాసి వేటాడగల్దే – ప్రభుత్వం. ఈళ్ళను, మన మద్యే ఉన్నోళ్ళను ఏటాడలేదా?

గల్దు. కాని నువ్ చేసిన ‘లా’ నువ్ రాసిన కాన్స్టిట్యూషనూ ఆణ్ణి కాపాడు తుండాల. అందుకూ ఆళ్ళు క్షేమంగున్నారు.

ఇదంతా మనకి బాగానే ఉండొచ్చు. ఎందుకంటే మనకి దానివల్ల నష్టంలేదు కాబట్టి. నష్టపోయిన వాళ్ళకు మాత్రం దాన్ని మార్చాలనుంటుంది. అది మారాలంటే నువ్వు మారనీవు. నిన్ను మార్చబోతే మార్చబోయిన వాళ్ళని దేశద్రోహులంటావు.

నేనొక మాటడుగుతాను.

నమ్మిన జన సామాన్యాన్ని నాయకుల్లో, పవర్లో ఉన్న పార్టీయో, పార్టీలో మనుషులో దగాచేస్తే – అది దేశద్రోహం కాదా? ఆళ్లెవరేనా కానీ – ఆ చేసీ దగాని బైటపెట్టడం, ఎదుర్కోమనడం, ఎదుర్కోవడం – ఇదా దేశద్రోహం?

ప్రెస్సూ, ప్లాట్‌ఫాం చేతిలో ఉంటే ఎన్ని బుకాయింపులేనా బుకాయిం చొచ్చు. కాని నిజం ఎప్పటికీ నిజఁవే. గాంధీగారి కోతులు కళ్ళూ చెవులూ నోరూ మూసీసుకోవాలనీ, మూసీసుకోండని చెప్పి యింకా వినప్పోతే బలవం తాన మూసీడానికి ప్రయత్నించొచ్చు. కాని – ★

*(విరసం ప్రత్యేక సంచిక – నిజం: 15-8-1971)*